క్లుప్తంగా

ఆలయాల అభివృద్ధికి కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలత



చైర్‌పర్సన్ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

తుక్కుగూడ: జిన్నాయిగూడ లక్ష్మీనర్సింహ స్వామి, ఈ–సిటీ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగేల హేమ లతరాజుగౌడ్ అన్నారు. శనివారం ఈ రెండు ఆలయాల్లో ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, నాయకులు మాధవరెడ్డి, శ్రీశైలం, నవీన్, శ్రీశైలం, శివరాజ్, ఆంజనేయులు, శ్రీధర్‌గౌడ్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

బీజేపీ పాలనలోనే సమన్యాయం

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్‌రెడ్డి



బాలాపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు చేస్తున్న శంకర్‌రెడ్డి

బడంగ్‌పేట్: బాలాపూర్ మండలంలో బీజేపీ నాయకులు జోరుగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నారు. శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి ఆన్‌లైన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జోరుగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పాలనలోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. ప్రధాని మోదీ దేశానికి రక్ష అన్నారు. పార్టీ నాయకులు, అభిమానులు, మహిళలు బీజేపీ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని కోరారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న వెంకటేశ్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌కు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు, సరూర్‌నగర్ మండల మాజీ వైస్ ఎంపీపీ గడ్డం వెంకటేశ్‌ను ఎస్సీ మోర్చా రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ సెల్ కో–కన్వీనర్‌గా నియమించారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ చేతుల మీదుగా శనివారం ఉత్తర్వులు అందుకున్నారు. పార్టీ కోసం నిరంతం కృషి చేస్తున్న వెంకటేశ్ సేవలు గుర్తించి పార్టీ ఆధిష్టానం ఈ పదవిని అందజేసిందని శ్రీధర్ తెలిపారు. అనంతరం వెంకటేశ్‌ను ఘనంగా సన్మానించారు. నియామకానికి సహకరించిన పార్టీ పెద్దలకు వెంకటేశ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మోదీతోనే దేశం అభివృద్ధి



ఆన్‌లైన్లో సభ్యత్వాలు నమోదు చేయిస్తున్న కమలనాథులు

తలకొండపల్లి: ప్రధాని మోదీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ అనిల్ అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన పలు గ్రామాల్లో పర్యటించారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ సభ్యత్వ నమోదు చేయిస్తూ.. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం అనిల్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు యువత ఆకర్షితులై పార్టీలో సభ్యత్వం పొందుతున్నారని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అమలు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిందని, హామీలను నెరవేర్చేవరకు పోరాడతామన్నారు. మండలంలో 202 సభ్యత్వాలు నమోదు చేయించినట్లు చెప్పారు.

డ్రైనేజీ పనులు త్వరగా పూర్తిచేయండి

కడ్తాల్: రహదారిపై చేపట్టిన డ్రైనేజీ మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తలకొండపల్లి కూడలిలో కొనసాగుతున్న సైడ్ డ్రైన్ డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పనులు నాణ్యతాప్రమాణాలతో చేపట్టాలని ప్రాజెక్ట్ డిప్యూటీ మేనేజర్ భరద్వాజ్‌కు సూచించారు. బీఆర్‌ఎస్ రావిచేడ్ గ్రామ అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, నాయకులు అశోక్, వెంకటేశ్, జంగయ్య తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితా రెడీ

- మండలాల వారీగా వెలువడిన ఫైనల్ లిస్ట్
- ఎంపీడీఓ, జీపీ కేంద్రాల్లో ప్రదర్శన

మహేశ్వరం: మండలంలో గ్రామ పంచాయతీ, వార్డుల విభజన చేస్తూ అభ్యంతరాలను పరిష్కరించి, తుది ఓటరు జాబితాను విడుదల చేశామని ఎంపీడీఓ శైలజ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులతో ఆమె సమావేశం నిర్వహించి 2024 గ్రామ పంచాయతీల వారీగా తుది ఓటరు జాబితాను ఆమె ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 30 గ్రామ పంచాయతీలకు గాను 258 వార్డులుగా విభజించి మొత్తం 43,033 ఓట్లు (పురుషులు–21,591 ఓట్లు), (మహిళలు–21438), (ఇతరులు–4ఓట్లు) ఉన్నాయని తెలిపారు. ఈ నెల 19న ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఓటర్ జాబితాపై అభ్యంతరాలపై సమావేశం నిర్వహించి వారి నుంచి వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించి తుది ఓటరు జాబితాను ప్రకటించామన్నారు. మండలంలో ఉన్న 30 గ్రామ పంచాయతీ కార్యాలయాలకు గ్రామ పంచాయతీల వారీగా ఓటరు జాబితాను అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మహేశ్వరం: ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ శైలజ, అధికారులు

మండలంలో మొత్తం 50,769 ఓటర్లు

కందుకూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సరిత ఆధ్వర్యంలో శనివారం 35 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఓటర్ల ముసాయిదాను విడుదల చేశారు. మొత్తం ఓటర్ల లిస్టులో తప్పొప్పులు సరిచేయడం, చేర్పులు, మార్పులకు సంబంధించి మొత్తం 1240 అభ్యంతరాలు వచ్చాయని వాటిని 26వ తేదీ వరకు పరిశీలించి పరిష్కరించినట్లు ఈ సందర్భంగా ఎంపీడీఓ తెలిపారు. మొత్తం 35 జీపీల్లో 312 వార్డులకు సంబంధించి 50,769 మంది ఓటర్లు ఉన్నట్లుగా ఆమె తెలిపారు.



కందుకూరు ఎంపీడీఓ కార్యాలయంలో..

కార్యక్రమంలో కార్యాలయం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ప్రమాద బీమా హర్షణీయం

మేయర్ దుర్గ

మీర్‌పేట: మన ఇంటి పరిసరాలను, ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య సిబ్బంది పాత్ర కీలకమైనదని మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ అన్నారు. నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ (ఎన్ఐసీ) హైదరాబాద్ రీజినల్ వారి ఆధ్వర్యంలో శనివారం మీర్‌పేట ఆర్‌సీఐ రోడ్డులోని లయన్స్ భవన్ వద్ద స్వచ్ఛత–2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారిపై ఉన్న చెత్తా చెదారాన్ని, పిచ్చిమొక్కలను పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి తొలగించారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బంది, వాటర్‌మెన్‌లు, ఎలక్ట్రీషియన్‌లు 150 మందికి ఎన్ఐసీ వారు, 50 మందికి స్థానిక కార్పొరేటర్ అనిల్‌కుమార్ యాదవ్, జిల్లెలగూడ గీతాంజలి లయన్స్‌క్లబ్ ఫౌండర్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి 50 మంది మొత్తం 250 మందికి రూ.1లక్ష ప్రమాద బీమాను అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. మేయర్ దుర్గ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య, ఇతర కార్మికులను గుర్తించి ప్రమాదబీమాను ఉచితంగా అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్ఐసీ అసిస్టెంట్ మేనేజర్ కృష్ణ ప్రసాద్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఎన్ఐసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ లలితకళ, పారిశుద్ధ్య సూపర్‌వైజర్లు దాసరి రంజిత్, మహేందర్, దాసరి జీవన్‌కుమార్, ఇంద్రసేనారెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న ఎన్ఐసీ ప్రతినిధులు, మేయర్

భగత్‌సింగ్ సేవలు చిరస్మరణీయం



హుడాకాంప్లెక్స్: భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: దేశంలో బ్రిటీష్ పాలనను వ్యతిరేకిస్తూ విప్లవాత్మక ఉద్యమాలను చేపట్టి పిన్న వయసులో ఉరికంబమెక్కిన త్యాగశీలి స్వర్గీయ భగత్‌సింగ్ అని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాయకుడు శాంతకుమార్ అన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో శనివారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాంరాం కంపెనీ యజమాని దామోదర్ సచిన్ సోని, నాగార్జున, వెంకటేశ్, భరత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హుడాకాంప్లెక్స్: సీపీఐ సరూర్‌నగర్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం భగత్‌సింగ్‌నగర్ ఫేజ్–1లో భగత్‌సింగ్ 117వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ విగ్రహానికి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బాతరాజు నర్సింహ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యుడు జిల్లా కృష్ణ, సహాయ కార్యదర్శి బోయపల్లి రాములుగౌడ్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఎం.మద్దిలేటి, ఇదిరీస్‌బాయ్, కర్నాచారి, మహబూబ్, నర్సమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.



పహాడీషరీఫ్: నివాళులర్పిస్తున్న శాంతకుమార్ తదితరులు

లోక్‌అదాలత్‌తో సత్వర పరిష్కారం

జడ్జి అపర్ణ

మహేశ్వరం: పెండింగ్ కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన లోక్‌అదాలత్ ద్వారా ఇరువర్గాల పరస్పర ఆమోదంలో సత్వర న్యాయం అందుతుందని మహేశ్వరం కోర్టు జడ్జి అపర్ణ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో మహేశ్వరం కోర్టులో లోక్‌అదాలత్ నిర్వహించి పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ చక్కని వేదిక అన్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాల పరస్పర అమోదంతో సత్వర న్యాయం అందుతుందన్నారు. దీనిపై కక్షిదారులు అవగాహన పెంచుకొని కేసులను సయోధ్యతో పరిష్కారం చేసుకోవడం ఉత్తమ మార్గమన్నారు. లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు తమ కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించుకొని స్నేహపూర్వక వాతవరణంలో జీవనం కొనసాగించాలని, వివాదాలు పెంచుకొని సమయం వృథా చేసుకోరాదన్నారు. లోక్ అదాలత్‌లో సివిల్, ప్రమాద బీమా, రుణాల రికవరీ, చిట్‌ఫండ్ కేసులు, కుటుంబ వివాదాలు, ఫోన్ బకాయిలు, అబ్కారీ కేసులు, ఇతర సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరిస్తారన్నారు. కక్షిదారులకు ముందుగానే నోటీసులు జారీ చేసి వారిని లోక్ అదాలత్‌కి పిలుస్తామన్నారు. సీసీ కేసులు–72, సమ్మరి ట్రయల్ కేసులు–02, ఒరిజినల్ సూట్స్(సివిల్ కేసులు)–05, ఈ–పెట్టి కేసులు–93, ఎఫ్‌డీపీ(ఫైనల్ డిక్రి పిటీషన్స్) కేసు–01 మొత్తం 173 కేసులు పరిష్కరించి రాజీ చేశామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసీక్యూటర్ రమేశ్ బాబు, కోర్టు సూపరింటెండెంట్ కవిత, మహేశ్వరం, కందుకూరు సీఐలు వెంకటేశ్వర్లు, సీతారామ్, ఎస్ఐలు, న్యాయవాదులు, ప్రజలు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న జడ్జి అపర్ణ

సమాజ్‌వాదీ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా మహేందర్

కందుకూరు: సమాజ్‌వాదీ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా గూడూరుకు చెందిన కానపురం మహేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కటికెల శ్రీహరి చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నారు.

బాలసభ.. బాలికల ప్రతిభ

ఆమనగల్లు: బాలసభ ఆంద్యంతం ఆకట్టుకుంటోంది. విద్యార్థులే సభ నిర్వాహకులుగా వ్యవహరిస్తూ అలరిస్తున్నారు. తోటి విద్యార్థులతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ అబ్బురపరుస్తున్నారు. ప్రతి వారం ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షరజ్యోతి సహకారంతో సభ నిర్వహించారు. ఇందులో విద్యార్థులు కథలు, పొడుపు కథలను వినిపించారు. ఆటపాటలతో అలరించారు. విద్యాధికారులుగా వ్యవహరి స్తూ తమ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి పద్మజ్యోతి, ఉపాధ్యాయులు సరిత ఉన్నారు.

ఆకట్టుకున్న కార్యక్రమం

మాడ్గుల: కసూర్బాగాంధీ విద్యాలయంలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలసభ ఆకట్టుకుంది. ప్రతి శనివారం పాఠశాలలో నిర్వహించే కార్యక్రమంలో భాగంగా, బాలసభ వేదికగా విద్యార్థులు.. డీఈఓ, ఎంఈఓ, ఎస్ఓగా వ్యవహరించారు. కథలు చెప్పారు. నృత్యంతో ఆకట్టుకున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

కందుకూరు: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని హెచ్ఎం దేవేందర్ అన్నారు. మండల పరిధిలోని రాచులూరు జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా హెచ్ఎం ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి గ్రామంలో సేకరించే ఆటో లేదా ట్రాక్టర్‌కు అందించడం తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.సెల్వమణి, ఉపాధ్యాయులు రాజు, నర్సింహా, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి తొలి ప్రాధాన్యత



స్వచ్ఛత హి సేవలో చైర్ పర్సన్ తదితరులు

చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ

తుర్కయంజాల్: పారిశుద్ధ్య కార్యక్రమాలకు తొలి ప్రాధాన్యత ఇస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అన్నారు. శనివారం తొర్రూర్‌లోని ఫంక్షన్ హాల్‌లో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సంబంధిత అధికారులతో పలు అంశాలపై చర్చించారు. ఇంటింటి చెత్త సేకరణ, చెత్త ప్రాసెసింగ్ చేసే విధానం, చెత్తను సరైన పద్ధతిలో తొలగింపు, వేరు చేయడం, బతుకమ్మ పండుగకు తీసుకోవాల్సిన ఏర్పాట్లు, అంగన్‌వాడీల మరమ్మతు, కొత్త కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రస్తావించారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని అనురాధ ప్రారంభించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. స్వచ్ఛత హి సేవలో పాల్గొన్న సిబ్బందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత, కమిషనర్ అమరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు కుంట ఉదయశ్రీ. మర్రి మాధవి, కొత్తకుర్మ మంగమ్మ, నక్క శివలింగం గౌడ్, బొక్క శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాటం

బీసీ మహాధర్నాలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

ఆమనగల్లు/కడ్తాల్/మాడ్గుల: సంఘటిత ఉద్యమాలతోనే బీసీలకు రాజ్యాధికారం వస్తుందని, ఆ దిశగా పోరాటం చేయాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (నవీన్ కుమార్) పిలుపునిచ్చారు. వచ్చేది బీసీల రాజ్యమేనన్నారు. శనివారం కల్వకుర్తిలో నిర్వహించిన బీసీ మహాధర్నాలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ల సాధన కోసం రాజకీయాలకు అతీతంగా కలిసిరావాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, బీసీ రాష్ట్ర నాయకులు రవికుమార్, ఉష, రాజేందర్, వెంకటయ్య యాదవ్, సదానందంగౌడ్, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి ఘన స్వాగతం

బీసీ మహాధర్నాకు వెళ్తున్న క్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కడ్తాల్ మండల కేంద్రం, మాడ్గుల మండలం ఇర్విన్‌లో ఆగగా.. ఆయనకు స్థానిక నాయకులు ఘనం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కడ్తాలలో.. అంబేడ్కర్, జ్యోతిబాపూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలకు స్థానిక నాయకులతో కలిసి నివాళులర్పించారు. మాడ్గులలో.. ఇర్విన్ మండల ఏర్పాటు విషయం గురించి ఇర్విన్ గ్రామస్తులు.. ఎమ్మెల్సీకి వివరించగా.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.



మహాధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

వరద కాల్వను మళ్లించే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

పహాడీషరీఫ్: మామిడిపల్లి గ్రామంలో వరద నీరు సాఫీగా వెళ్లకుండా అడ్డగోలుగా పైపులైన్లు వేసిన ఘటనపై అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఈరంకి విశ్వనాథ్‌గౌడ్ కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మామిడిపల్లి గ్రామానికి ఎగువన ఉన్న విమానాశ్రయం నుంచి వచ్చే వరదనీరు సాఫీగా జల్‌పల్లిచెరువు వైపు సహజసిద్ధంగా కాల్వ ద్వారా వెళ్లకుండా కొందరు ఉద్దేశపూర్వకంగా ఆ నీటిని పైపులైన్ ద్వారా మామిడిపల్లి ప్రధాన రహదారి మీదుగా శ్మశానవాటిక వైపు మళ్లించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆంజనేయస్వామి ఆలయం నుంచి దిగువకు వేసిన పైపులైన్ వద్ద అవుట్‌లెట్ లేక పైపులైన్లు ఎక్కడికక్కడ ఊడిపోయాయన్నారు. ముందు ముంపు సమస్య తలెత్తకుండా అధికారులు సరైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోండి

తలకొండపల్లి: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. శనివారం మండల పరిధి కోరింతకుంటతండాలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆయన వైద్య శిబిరం ప్రారంభించారు. వైద్యులు అఖిల్, అనిల్ నేతృత్వంలో, హైదరాబాద్ కామినేని ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో 155 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రవి నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అంజయ్య, గౌడ సంఘం తాలూకా కన్వీనర్ అశోక్ గౌడ్, పట్టు రైతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శక్రు నాయక్, బాలు, నరేష్, బిక్యనాయక్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సేవా సంఘం నాయకుడు మృతి

నివాళి అర్పించిన నేతలు

కడ్తాల్: మాజీ ఎంపీపీ కమ్లీ భర్త, గిరిజన సేవా సంఘం రాష్ట్ర నాయకుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేపవత్ మోత్యానాయక్(47) అనారోగ్యంతో శనివారం చనిపోయారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.. మైసిగండిలోని మోత్యానాయక్ పార్థివదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళి అర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్ తదితరులు ఉన్నారు.

జోనల్‌స్థాయిలో విద్యార్థుల ప్రతిభ

ఆమనగల్లు: జోనల్‌స్థాయి క్రీడా పోటీల్లో ఆమగనల్లు విద్యార్థులు సత్తాచాటారు. తలకొండపల్లి మండల కేంద్రంలో రెండు రోజుల పాటు ఎస్‌జీఎఫ్ జోనల్‌స్థాయి వాలీబాల్ టోర్నీని నిర్వహించారు. ఈ పోటీల్లో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల విద్యార్థులు పాల్గొనగా.. పట్టణానికి చెందిన వివేక విద్యాభారతి విద్యార్థులు విజేతగా నిలిచి, ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. బాలికల విభాగంలో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో వివేక విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవగా.. తలకొండపల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బాలికలను పాఠశాల ప్రిన్సిపాల్ మహమూద్, కరస్పాండెంట్ గోలి శ్రీనివాస్ అభినందించారు.

ఘనంగా భగత్ సింగ్ జయంతి

మంచాల: భగత్ సింగ్ జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శనివారం మండల పరిధి ఆరుట్ల గ్రామంలో ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు ఎల్లేష్, బుచ్చయ్య, భాషయ్య, ప్రసాద్, జంగయ్య, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి

డాక్టర్ సైదమ్మ

తలకొండపల్లి: పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని డాక్టర్ సైదమ్మ అన్నారు. శనివారం మండల పరిధి రాంపూర్, జంగారెడ్డిపల్లి, మెదక్‌పల్లి గ్రామాల్లో, గట్టు ఇప్పలపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించి, అవగాహన కల్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు అవసరమైన వైద్య ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

పొగతాగడం గుండెకు చేటు

ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా డాక్టర్ సైదమ్మ హృదయ సంబంధిత వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. మనం తీసుకునే ఆహారం, రక్తపోటు, వాయు కాలుష్యం, హై కొలెస్ట్రాల్, పొగ తాగడం కారణంగా గుండె జబ్బులు వస్తాయని పేర్కొన్నారు. గుండె ఆరోగ్యంగా ఉండాలంటే జీవనశైలిని మార్చుకోవాలని సూచించారు. నిత్యం వ్యాయామం చేయడంతో పాటు, గంట పాటు నడక, 8 గంటలు తక్కువ కాకుండా నిద్రపోవడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, శుభ్రమైన ఆహారం, నీటిని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ ఆంజనేయులు, హెచ్ఏ మల్లయ్య, ఏఎన్ఎంలు, ఆశలు రేవతి, జంగమ్మ, కార్యదర్శులు రమేష్ నాయక్, లింగారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.



రాంపూర్ వైద్య శిబిరంలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది